క్లుప్తంగా

ఏరియా ఆసుపత్రిలో సౌకర్యాలు కల్పించాలి

శ్రీరాంపూర్: రామకృష్ణాపూర్‌లోని ఏరియా ఆసుపత్రిలో సౌకర్యాలు మెరుగుపర్చాలని టీబీజీకేఎస్ కేంద్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్ రెడ్డి, బ్రాంచ్ ఉపాధ్యక్షుడు బండి రమేశ్, కేంద్ర కమిటీ నాయకులు పానుగంటి సత్తయ్య, పొగాకు రమేశ్, అన్వేష్ రెడ్డిలు ఆదివారం ఒక ప్రకటనలో యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. ఆసుపత్రి వద్ద ఓపీ చీటీలు రాస్తే, కౌంటర్ వద్ద కనీసం షెడ్డు సౌకర్యం లేదన్నారు. క్యూ లైన్‌లో ఉన్న రోగులు ఎండకు, ఎండుతూ, వానకు తడుస్తున్నారన్నారు. ప్రస్తుతం ఉన్న కొద్దిపాటి షెడ్డు ఏమాత్రం ఉపయోగపడటం లేదన్నారు. వెంటనే పెద్దషెడ్డు నిర్మించి ఫ్యాన్లు, తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరారు.

ఎస్సీ వసతిగృహంలో తల్లిదండ్రుల సమావేశం



మాట్లాడుతున్న చందన

మంచిర్యాలఅర్బన్: స్థానిక ఎస్సీ కళాశాల బాలికల వసతిగృహంలో ఆదివారం తల్లిదండ్రుల (పేరెంట్స్) సమావేశం జరిగింది. ప్రభుత్వం అందించే భోజనం, ఉచిత వసతి, పలు విషయాలపై చర్చించారు. ఈ సందర్భంగా వసతిగృహ సంక్షేమాధికారి చందన మాట్లాడుతూ.. విద్యార్థినుల ఆరోగ్యం, పరిశుభ్రతపై శ్రద్ధపై తెలిపారు. టీనేజ్‌లో జరిగే మార్పుల గురించి వాటిని ఏ విధంగా అధిగమించాలో కులంకుషంగా వివరించారు. విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు.

ఓపెన్ పీజీ, డిగ్రీ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

బెల్లంపల్లి: బెల్లంపల్లి ప్రభుత్వ పీజీ, డిగ్రీ కళాశాలలోని ఎస్‌డీఎల్‌సీఈ స్టడీ సెంటర్‌లో దూర విద్యలో ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కాంపల్లి శంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. పీజీలో ఎంఏ అన్ని సబ్జెక్టులు, ఎంకామ్ తోపాటు డిగ్రీలో అన్ని కోర్సులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రస్తుత విద్యా సంవత్సరం 2025–26లో పీజీ లేదా డిగ్రీలో చేరేందుకు ఈ నెల 10వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఇతర వివరాల కోసం 99592 69975 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

నేడు అఖిలపక్ష సమావేశం

వేమనపల్లి: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం రెండో విడత సాధారణ ఎన్నికలు 2025ఎంపీటీసీ, జెడ్పీటీసీల డ్రాఫ్ట్ పోలింగ్ స్టేషన్‌ల జాబితా సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కుమారస్వామి తెలిపారు. ఈ సమావేశానికి అన్ని రాజకీయ పార్టీల నాయకులు, మండల అధ్యక్షులు హాజరుకావాలని కోరారు.

లడ్డూ ధర రూ. 55,016



లడ్డూ దక్కించుకున్న దుర్గం రాజేశ్

మంచిర్యాలఅర్బన్: స్థానిక పాత మంచిర్యాల విశ్వకళ గణేశ్ మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పూజలందుకున్న లడ్డూ ధర రూ.55,016 పలికింది. శనివారం రాత్రి నిర్వహించిన వేలంలో ఎన్నడూలేని విధంగా స్థానికుడు దుర్గం రాజేశ్ రూ 55,016లకు లడ్డూను దక్కించుకున్నారు.

వేలాల ఆలయానికి తాళం



జైపూర్: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన వేలాల మల్లన్న శ్రీ మల్లికార్జునస్వామి ప్రధాన ఆలయం, శ్రీ గట్టు మల్లన్న స్వామి ఆలయాలను ఆదివారం సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా ఆలయాలకు తాళం వేశారు. ఆదివారం మధ్యాహ్నం 12గంటలకు తాళం వేసి ఆలయాలను మూసి వేయగా, సోమవారం ఉదయం 6గంటలకు మళ్లీ ఆలయాలను తెరిచి శుద్ధి, సంప్రోక్షణ, అభిషేకపూజలు చేసి మళ్లీ భక్తులకు దర్శన సౌకర్యం కల్పించనున్నట్లుగా ఆలయ ఈవో రమేశ్ తెలిపారు.

రోడ్డు శుభ్రం చేయించిన పోలీసులు

మందమర్రిరూరల్: పట్టణంలోని మార్కెట్ ప్రాంతంలో ఆదివారం తాగుబోతు హల్చల్ చేశాడు. ఖాళీ బీరు సీసాలు రద్దీగా ఉండే రోడ్డుపై పగులగొట్టాడు. రోడ్డుపైన సీసల ముక్కలు ప్రమాదకరంగా పడి ఉండడంతో స్థానికులు పోలీసులకు తెలియజేశారు. అక్కడికి చేరుకున్న పోలీసులు తాగుబోతుతోనే రోడ్డును శుభ్రం చేయించారు.

నిబంధనలు సరే.. అమలేది?

- యథేచ్ఛగా పాలిథిన్ కవర్ల వినియోగం
- పట్టించుకోని అధికారులు



పాలిథిన్ కవర్లు తింటున్న పశువులు

చెన్నూర్‌రూరల్: పాలిథిన్ కవర్ల నిషేధం అమలు కావడం లేదు. అధికారుల ఆదేశాల మేరకు కొన్ని రోజుల పాటు నిషేదాన్ని పాటించిన, దుకాణదారులు, వ్యాపారులు తిరిగి వాటి వాడకాన్ని ప్రారంభించారు. గ్రామాలలో పాలిథిన్ వినియోగాన్ని గతంలో నిషేధించారు. కవర్ల వాడకంతో కలిగే దుష్ప్రభావాలను అధికారులు ప్రజలకు తెలియజేస్తూ అవగాహన కల్పించారు. దుకాణదారులకు సైతం ప్లాస్టిక్ కవర్లను వాడద్దని అవగాహన కల్పించి, నోటీసులు అందజేశారు. నిబంధనలు ఉల్లంఘించిన వారికి జరిమానాలు కూడా విధించి ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని తగ్గించారు. కానీ మళ్లీ కొన్ని రోజుల తర్వాత ప్లాస్టిక్ కవర్ల వినియోగం యథావిధిగా కొనసాగుతోంది. అధికారులు కూడా చూసి చూడనట్టుగా వ్యవహరిస్తున్నారు.

పల్లెల్లో సైతం ప్లాస్టిక్ వినియోగం..

పట్టణాలకే పరిమితమైన పాలిథిన్ కవర్ల వినియోగం పల్లెలకు సైతం విపరీతంగా వ్యాపించింది. దీంతో గ్రామాల్లో నిత్యావసర వస్తువులు ఏది కొనుగోలు చేసినా, ప్లాస్టిక్ కవర్లలో వేసి ఇస్తున్నారు. వినియోగదారులు ఈ కవర్లను బయట ఎక్కడ పడితే అక్కడ పడేస్తుండటంతో పశువులు వాటిని తిని అనారోగ్యానికి గురవుతున్నాయి. కవర్లను కాల్చడం వల్ల పర్యావరణానికి ముప్పు వాటిల్లడంతోపాటు అనారోగ్యం బారిన పడుతున్నారు. సంబంధిత అధికారులు గ్రామాల్లో ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించాలని, ప్లాస్టిక్ కవర్లను అమ్మే వారిపై చర్యలు తీసుకుంటే వాడకం తగ్గుతుందని ప్రజలు సూచిస్తున్నారు.

ప్లాస్టిక్ వినియోగిస్తే చర్యలు తప్పవు...

గతంలోనే నిషేధిత పాలిథిన్ కవర్లను వినియోగించొద్దని గ్రామీణ ప్రాంతాల ప్రజలకు అవగాహన కల్పించాం. ఇప్పటికీ అవగాహనలు కల్పిస్తున్నాం. దుకాణాల్లో ప్లాస్టిక్ కవర్లను వినియోగిస్తే చర్యలు తీసుకుంటాం.

– మోహన్, ఎంపీడీవో, చెన్నూర్

ప్రజల నుంచి ఫిర్యాదుల స్వీకరణ



ఫిర్యాదులు స్వీకరిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

చెన్నూర్: మున్సిపాలిటీ పరిధిలో బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో 'అప్పుడే మంచిగా ఉండే' కార్యక్రమంలో భాగంగా ఆదివారం 3, 10, 18వార్డుల్లో ఇంటింటికీ వెళ్లి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ మాజీ కౌన్సిలర్లు మాట్లాడుతూ.. కాంగ్రెస్ 20నెలల పాలనలో ప్రజలకు ఒరిగిందేమి లేదన్నారు. ఆరు గ్యారంటీల పేరుతో కాంగ్రెస్ మోసం చేసిందని ప్రజలు తమ ఫిర్యాదుల్లో పేర్కొంటున్నారని తెలిపారు. ఈ ఉద్యమాన్ని మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ చెన్నూర్ నియోజకవర్గంలో పైలెట్ ప్రాజెక్ట్‌గా ప్రారంభించారని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు రాంలాల్‌గిల్డా, మాజీ కౌన్సిలర్లు రెవెల్లి మహేశ్, జోడు శంకర్, నాయకులు ఆరిఫ్, వెంకటరాజం, హరి, మహేందర్, పెండ్యాల లక్ష్మణ్, బొగె భారతిలు పాల్గొన్నారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో అభిప్రాయ సేకరణ



మాట్లాడుతున్న నాయకులు

రామకృష్ణాపూర్: సింగరేణి కార్మికుల సొంతింటి కల కోసం ఈ నెల 11, 12 తేదీల్లో సీఐటీయూ ఆధ్వర్యంలో అన్ని గనులు, డిపార్ట్‌మెంట్లపై కార్మికుల అభిప్రాయసేకరణ చేపట్టనున్నట్లు యూనియన్ బ్రాంచి అధ్యక్షుడు ఎస్.వెంకటస్వామి, కార్యదర్శి అల్లి రాజేందర్ తెలిపారు. స్థానిక యూనియన్ కార్యాలయంలో ఆదివారం వారు మాట్లాడారు. రెండు రోజుల పాటు అభిప్రాయసేకరణ చేపట్టిన తర్వాత 15న జీఎం ఆఫీస్ ఎదుట ధర్నా చేపడుతామన్నారు. సంస్థకు వచ్చిన లాభాలను ప్రకటించి వాటిలో 35శాతం వాటాను ప్రకటించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ చేపట్టే కార్యక్రమాలను చూసి ఓర్వలేక కొన్ని కార్మిక సంఘాలు తమ సంఘంపై అసత్య ప్రచారాలు చేస్తున్నాయని, కార్మికులు వాటిని నమ్మొద్దన్నారు. కార్యక్రమంలో నాయకులు రామగిరి రామస్వామి, రమేశ్, సంజీవ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకులకు ఘన సన్మానం



సన్మానిస్తున్న మండల బీజేపీ నాయకులు

తాండూర్: బీజేపీ నూతనంగా ప్రకటించిన జిల్లా కమిటీలో స్థానం దక్కించుకున్న తాండూర్ మండల నాయకులను మండల కమిటీ ఘనంగా సత్కరించింది. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు రామగొని మహీధర్‌గౌడ్, జిల్లా కార్యవర్గ సభ్యుడు సిద్ధం మల్లేశ్, సంఘర్ష్ శీతల్, తాండూర్ మండల ప్రధాన కార్యదర్శులుగా నియమితులైన పుట్ట కుమార్, మామిడి విఘ్నేష్, మండల కార్యదర్శి గాదే రాజేషంలను పూలమాలలు వేసి శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొయ్యల ఏమాజీ హాజరయ్యారు. పార్టీలో కష్టపడి పని చేసిన ప్రతి ఒక్కరికి సముచిత స్థానం ఉంటుందని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అందరూ కలిసికట్టుగా పనిచేసి అత్యధిక స్థానాల్లో గెలుపొందాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు దూడపాక భరత్‌కుమార్, జిల్లా అధికార ప్రతినిధి శ్రీకృష్ణదేవరాయలు, సీనియర్ నాయకులు చిలువేరు శేషగిరి, పులుగం తిరుపతి, నాయకులు శంతన్, శ్రావణ్‌కుమార్, శ్రీనివాస్, విజయ్, సురేష్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

కాసిపేట: మండల కేంద్రంలోని ముత్యంపల్లిలో ఆదివారం బీజేపీ మండలాధ్యక్షుడు సూరం సంపత్ కుమార్ ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ప్రభుత్వం జీఎస్టీ స్లాబుల తగ్గింపుపై తీసుకొచ్చిన సంస్కరణలను హర్షించారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు మేలు చేకూరే విధంగా మోదీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అభినందనీయమని పేదల సంక్షేమానికి ఎల్లప్పుడు పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి దేవునూరి సంతోష్, రెడ్డి బాలరాజ్, మండల ఉపాధ్యక్షుడు బాకీ కిరణ్, రెడ్డి చారులత, దోమల రాంచందర్, గుంపుల సదయ్య, నైతం వెంకటేశ్వర్లు, ఆదర్శ్, మహేశ్ తదితరులున్నారు.

ముస్లింల శాంతియుత ర్యాలీ



బెల్లంపల్లి: అంబేద్కర్ చౌరస్తా వద్ద మాట్లాడుతున్న మత గురువు

బెల్లంపల్లి: బెల్లంపల్లిలో మిలాద్ ఉన్‌నబీని పురస్కరించుకొని ఆదివారం ముస్లింలు పుర వీధుల్లో శాంతియుత ర్యాలీ జరిపారు. బాబుక్యాంపు బస్తీలోని జమా మసీదు వద్ద నుంచి ప్రారంభమైన ర్యాలీ అశోక్ నగర్ ఈద్గా, రాంనగర్, హన్మాన్ బస్తీ, పాత బస్టాండ్ ఏరియా, బజారుఏరియా మీదుగా బాబాసాహెబ్ బీఆర్ అంబేద్కర్ చౌరస్తా వరకు ప్రదర్శన చేశారు. అంతకు ముందు భక్తిప్రపత్తులతో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అంబేద్కర్ చౌరస్తా వద్ద ముస్లిం మత గురువులు ప్రత్యేకంగా మాట్లాడారు. శాంతి, సామరస్యత, నీతి, నిజాయితీ, ధాన ధర్మాలు, పరోపకారం ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో పలు మసీదుల అధ్యక్ష, కార్యదర్శులు మత గురువులు, యువకులు పాల్గొన్నారు.

చెన్నూర్: పట్టణంలోని ఐబీ దర్గా నుంచి ప్రధాన వీధుల్లో మత పెద్దలు భక్తి గీతాలు ఆలపిస్తూ ముస్లింలు ర్యాలీలు నిర్వహించారు. అనంతరం దర్గా వద్ద అన్నదానం చేశారు.

తాండూర్: మండల కేంద్రంలో ముస్లింలు ఆదివారం ర్యాలీ నిర్వహించారు. తాండూర్‌లోని జమ మసీదు నుంచి మండల కేంద్రం మీదుగా కిష్టంపేట నుంచి తాండూర్ ఐబీ మసీదు వరకు ర్యాలీ కొనసాగించారు. అనంతరం అన్నదాన కార్యక్ర మ ం చేపట్టారు. తాండూర్ ఎస్సై కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

జైపూర్: మండల కేంద్రంలో ముస్లిం కులపెద్దలు గౌస్‌బాబా ఆధ్వర్యంలో మసీదులో ప్రత్యేక ప్రార్థలు చేశారు. అనంతరం ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించారు.

రామకృష్ణాపూర్: జమ మసీద్ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ చేపట్టారు. పట్టణంలోని ఆర్‌కే1 మార్కెట్ నుంచి బీజోన్ వరకు ర్యాలీ సాగింది.



జైపూర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు



చెన్నూర్‌లో...



రామకృష్ణాపూర్‌లో...

సామూహిక వివాహాలకు రిజిస్టర్ చేసుకోండి

వేమనపల్లి: వచ్చే నెల అక్టోబర్ 26న బెల్లంపల్లిలోని బుధాగెస్ట్‌హౌస్ రోడ్డు శివాలయంలో నిర్వహించే ఉచిత సామూహిక వివాహాలకు యువతి, యువకులు అక్టోబర్ 1వ తేదీలోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని మాజీ జెడ్పీటీసీ సంతోష్‌కుమార్ అన్నారు. నీల్వాయిలో ఆదివారం పోస్టర్ ఆవిష్కరించారు. తిలక్ వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత సామూహిక వివాహాలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో తిలక్ వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు గెల్లి జయరాజ్, రంగ రామయ్య, బోగే శ్రీనివాస్, నాగుల లింగయ్య, ఏనుగు నరేశ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సాబీర్‌అలీ ఉన్నారు.

సన్మానం



సన్మానిస్తున్న వాడ బలిజ సేవా సంఘం నాయకులు

పాతమంచిర్యాల: ఇండియన్ యూత్ కాంగ్రెస్ పట్టణ కో ఆర్డినేటర్‌గా ఎన్నికైన బోడెంకి మహేశ్‌ను జిల్లా కేంద్రంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మహేశ్ మాట్లాడారు. తనపై నమ్మకం ఉంచి తనకు బాధ్యాతాయుతమైన ఇండియన్ యూత్ కాంగ్రెస్ పట్టణ కో ఆర్డినేటర్‌గా నియామకం చేసిన ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు, జిల్లా డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖకు కాంగ్రెస్ అధిష్టానానికి రుణపడి ఉంటానన్నారు. కార్యక్రమంలో వాడ బలిజ సేవా సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు గారె శంకర్, జిల్లా కోశాధికారి గగ్గూరీ రాజన్న, పట్టణ అధ్యక్షుడు గగ్గూరీ సత్తయ్య, నాయకులు బోడెంకి చందు, మనోజ్, రాజేష్, గారే శాంత పాల్గొన్నారు.


ఏళ్లుగా ఆ బడికి తాత్కాలిక విద్యుత్తే!



కొండాపూర్ ప్రాథమిక పాఠశాల భవనం

దండేపల్లి: మండలంలోని కొండాపూర్ ప్రాథమిక పాఠశాలకు ఏళ్లుగా తాత్కాలిక విద్యుత్ కనెక్షన్‌తోనే నడిపిస్తున్నారు. పాఠశాల భవనం శిథిలావస్థకు చేరడంతో, పాత భవనానికి కొద్ది దూరంలో సుమారు ఐదేళ్ల క్రితం కొత్త భవనం నిర్మించారు. నాలుగేళ్ల క్రితం పాఠశాలను కొత్తభవనంలోకి షిఫ్టు చేశారు. పాఠశాలకు సంబంధించిన విద్యుత్‌మీటరు కొత్త భవనంలోకి షిఫ్టు చేయడానికి పాఠశాల భవనం వరకు సింగిల్‌ఫేజ్ విద్యుత్‌లైన్ లేదు. దీంతో ఇప్పటికీ పాఠశాల విద్యుత్ మీటరు కొత్తభవనంలోకి షిఫ్టు చేయకపోవడంతో, పాఠశాల సమీపంలో గల ఓ వ్యవసాయ మోటారు దగ్గర నుంచి తాత్కాలిక విద్యుత్ కనెక్షన్ తీసుకొని కాలం వెల్లదీస్తున్నారు. అధికారులు స్పందించి పాఠశాల వరకు సింగిల్‌ఫేజ్ లైన్ ఏర్పాటు చేసి, పాఠశాల కొత్త భవనంలో విద్యుత్ మీటరు బిగించాలని పాఠశాల సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

పాతది శిథిలం.. కొత్తది అసంపూర్తి!



అసంపూర్తిగా సమాఖ్య భవన నిర్మాణం



శిథిలావస్థలో ప్రస్తుత మండల సమాఖ్య భవనం

- ఇదీ దండేపల్లి మండల సమాఖ్య భవనం తీరు
- పట్టించుకోని అధికారులు, పాలకులు..

దండేపల్లి: మండల కేంద్రంలో శ్రీలక్ష్మీ మండల సమాఖ్యకు, ఐకేపీ కార్యాలయాలకు పక్కా భవనం లేక మండల సమాఖ్య లీడర్లు, సభ్యులతో పాటు, ఐకేపీ కార్యాలయ సిబ్బంది గత కొన్నేళ్లుగా ఇబ్బందులు పడుతున్నారు. ఐకేపీ కార్యాలయ నిర్వహణతో పాటు, మండల సమాఖ్య సమావేశాలు నిర్వహించేందుకు అరకొర వసతుల నడుమ కాలం వెల్లదీస్తున్నారు. గతంలో మండల పరిషత్ కార్యాలయానికి వినియోగించిన పాత భవనంలో ప్రస్తుతం మండల సమాఖ్య, ఐకేపీ కార్యాలయం నిర్వహిస్తున్నారు. వీటికి పక్కా భవనం నిర్మాణం కోసం దండేపల్లి పోలీస్‌స్టేషన్ సమీపంలో సహకార సంఘం భవనం పక్కన పక్కా భవన నిర్మాణం పనులు ప్రారంభించి పదేళ్లు అవుతుంది. అయిన పనులు అర్ధంతరంగానే ఆగిపోయాయి. ఓపెన్ స్లాబ్ వేసి ఆపేశారు. అంతే తప్పా పదేళ్లుగా పనులు ముందుకు సాగడం లేదు. భవన నిర్మాణం గురించి సంబంధిత అధికారులుగానీ, ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడం లేదు. దీంతో పక్కా భవనం పూర్తి కాకముందే శిథిలమయ్యాలే కనిపిస్తుంది. ప్రస్తుతం ఉన్న మండల సమాఖ్య, ఐకేపీ కార్యాలయ భవనం శిథిలావస్థలో ఉంది. ఇటీవల కురిసిన వర్షాలకు స్లాబు ఉరవడంతో, వర్షం నీళ్లు కార్యాలయంలోకి వచ్చి చేరాయి. పైగా హెర్తింగ్ సమస్యతో గోడలను ముట్టుకుంటే విద్యుత్ సరఫరా కావడంతో అందులో పనిచేసే సిబ్బంది భయాందోళన చెందుతున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి దండేపల్లిలో అసంపూర్తిగా ఉన్న మండల సమాఖ్య, ఐకేపీ కార్యాలయ భవన నిర్మాణం పనులు త్వరగా పూర్తిచేయించాలని పలువురు కోరుతున్నారు.

రైతులకు రాయితీపై పరికరాలు

కాసిపేట: మండలంలోని రైతులకు 2025–26సంవత్సరానికి సంబంధించి వ్యవసాయ యాంత్రికరణలో భాగంగా ప్రభుత్వం రాయితీపై పనిముట్లు అందిస్తుందని మండల వ్యవసాయశాఖ అధికారి ప్రభాకర్ తెలిపారు. బ్యాటరీ స్ప్రేయర్స్–84, పవర్ స్ప్రేయర్స్–15, రోటోవేటర్స్–05, ఎంబీ ప్లవ్/కల్టివేటర్/కేజీవీల్స్–05, విత్తనాలు విత్తే యంత్రము–01, పవర్ వీడర్–01, బ్రష్ కట్టర్–01 పరికరాలు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. ఈ నెల 12లో పు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆసక్తిగల రైతులు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా సూచించారు. దరఖాస్తు పత్రంతో పాటు భూమి పట్టాపాస్‌బుక్, ఆధార్ కార్డు, ట్రాక్టర్ ఆర్‌సీ(ట్రాక్టర్ సంబంధిత పనిముట్లకు) జత పర్చాల్సిందిగా సూచించారు.

కల్వర్టు నిర్మించరూ?



భీమారం మండల కేంద్రంలోని ఆర్కెపల్లి వీధిగుండా ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లే రహదారిలో వరద నీళ్లు వెళ్లేందుకు వీలు లేక పెద్ద ఎత్తున రోడ్డు పైనే నిల్వ ఉంటున్నాయి. ఇక్కడ కల్వర్టు నిర్మించి వరద నీటిని బయటకు పంపించాలని స్థానికులు అధికారులను కోరుతున్నారు.

– భీమారం

ఆటోడ్రైవర్ కుటుంబానికి ఆర్థికసాయం



సాయం అందిస్తున్న యూనియన్ సభ్యులు

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రానికి చెందిన సీనియర్ ఆటో డ్రైవర్ మాదర వేణి నర్సింగం ఈ నెల 3న ఆకస్మికంగా మృతి చెందడంతో ఆటో యూనియన్ నాయకులు ఆయన కుటుంబానికి అండగా నిలిచారు. ఈ సందర్భంగా ఆదివారం తెలంగాణ ఆటో జేఏసీ ప్రణాళిక సంఘం చైర్మన్ గాజుల ముఖేష్ గౌడ్, జిల్లా ఆటో యూనియన్ గౌరవ అధ్యక్షుడు బెల్లంకొండ మురళి, పట్టణ ఆటో యూనియన్ అధ్యక్షుడు ఎండీ షఫి, యూనియన్ నాయకులు నర్సింగం కుటుంబానికి రూ.25వేల నగదు, 25కేజీల బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు.